క్లుప్తంగా

నాగయ్య కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న వినోద్, వేణుగోపాలాచారి

బెల్లంపల్లి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బెల్లంపల్లి వాసి ఉమ్మడి రాష్ట్ర మాజీ పీసీసీ వైస్ ప్రెసిడెంట్ తాటి పాముల నాగయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నాగయ్య చిత్రపటానికి శనివారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారితో కలిసి పూల మాలవేసి ఎమ్మెల్యే వినోద్ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, నాయకులు తొంగల మల్లేష్, ఉదయ్‌కాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల దుండగులపై చర్యలు తీసుకోవాలి

జైపూర్: ప్రసిద్ధిగాంచిన వేలాల గట్టుమల్లన్న స్వామి దొణలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని వేలాల గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని శనివారం వారు సందర్శించారు. విషయాన్ని ఆలయ పూజారి బయటకు రానివ్వకుండా చేశారని, పోలీసులు విచారణను వేగవంతం చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసాల తిరుపతి, సుందిళ్ల గట్టయ్య, రాజ్‌కుమార్, హరీశ్, జశ్వంత్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటింటి ప్రచారంలో కోరారు. జిల్లా కేంద్రంలోని ఆరో వార్డు గర్మిళ్లలో శనివారం ఇంటింటి ప్రచారంను స్థానిక కౌన్సిలర్ సుంకరి శ్వేతతో కలిసి నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు.

సన్మానం



శ్రీవల్లిని సన్మానిస్తున్న మోకుదెబ్బ నాయకులు

జన్నారం: చదువుకు పేదరికం అడ్డురాదని, కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఇందుకు విలాసారం శ్రీవల్లి నిదర్శనమని మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీవల్లిని శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన భవిష్యత్‌ను నిర్ణయించేది చదువే అని, చదువుకుంటే మన భవిష్యత్‌ను పూలబాట చేసుకోవచ్చన్నారు. గౌడ ఇంటి పేద విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోకుదెబ్బ డివిజన్ అధ్యక్షుడు నర్సగౌడ్, మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, నాయకులు వెంకటేశం గౌడ్, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

కన్నెపల్లి మండల సమావేశం



భీమిని: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని కన్నెపల్లి ఎంపీపీ మాదవరపు సృజనరావు అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈజీఎస్ సిబ్బందికి టెంట్, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. 20శాఖలకు గాను 8 శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ గంగామోహన్, వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, ఏపీఓ శ్రీనివాస్, ఆర్ఐ కిషన్‌రావు, వెటర్నరీ డాక్టర్ హారిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, ఏఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



దండేపల్లి: మేదరిపేట సంతలో గొడుగు నీడన వ్యాపారం

దండేపల్లి: భానుడి ప్రతాపంతో జిల్లా ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వేసవిలో ఎండ తీవ్రతకు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చూసి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. జిల్లాలో శనివారం పలు ప్రాంతాల్లో 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జిల్లాలో చాలా ప్రాంతాలు ఆరెంజ్ జోన్‌లో..

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సీయస్ పైనే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఆరెంజ్ జోన్‌లోకి చేరాయి. జిల్లాలోని భీమిని, జన్నారం, భీమారం, చెన్నూర్ మండలం లోని కొమ్మెర, హాజీపూర్, కోటపల్లి మండలం దేవులవాడ, కాసిపేట మండలం కొండాపూర్ లో 44 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, బెల్లంపల్లి, జైపూర్, వేమనపల్లి, కన్నెపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, పాతమంచిర్యాల, నస్పూర్, మందమర్రి, నెన్నెల లలో 43 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు, కో టపల్లి, దండేపల్లిలో 42 డిగ్రీలు, చెన్నూర్, తాండూర్‌లో 41 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 డిగ్రీలు దాటిన ప్రాంతాలను ప్రభుత్వం ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్తే, ఎండ తగలకుండా రుమాలు, చెత్రీలు, టోపీలు ధరించాలని సూచిస్తున్నారు.

పగటి వేళ నిర్మానుష్యం

జిల్లాలోని రద్దీగా ఉండే పలు ప్రాంతాలు ఎండల తీవ్రతతో పగటి వేళ నిర్మానుష్యంగా కనిపించాయి. వారసంతల్లో వ్యాపారులు గొడుగులు, డేరాల నీడన వ్యాపారాలు సాగించారు.



దండేపల్లి: బస్టాండ్ సమీపంలో పగటివేళ నిర్మానుష్యంగా ఓ వీధి

'ఉపాధి' పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధారాథోడ్

జన్నారం: ఎండ తీవ్రత పెరుగుతున్నందునా ఉపాధి హామీ కూలీలకు నీడ, నీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవో శశికళ అన్నారు. కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఉపాధి హామీ సిబ్బందికి, కార్యదర్శులకు ఎంపీడీవో శశికళ మెడికల్ కిట్లు అందజేశారు. ఎండ తీవ్రతకు కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందునా, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఎంపీవో రమేశ్, ఏపీవో రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని నందులపల్లి, నెన్నెల పంచాయతీలలో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఏపీఓ నరేష్, కార్యదర్శులు శనివారం మౌలిక సదుపాయాలు కల్పించారు. వడదెబ్బ తగలకుండా గ్రీన్ నెట్‌లతో నీడ, తాగునీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో నందులపల్లి, నెన్నెల కార్యదర్శులు పద్మనాభం, సాగర్, ఆశ కార్యకర్తలు స్వరూప, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'ఉపాధి'పనుల పరిశీలన

భీమారం: మండలంలో పోతన్‌పల్లి శివారులో ప్రాంతంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం రాధారాథోడ్ సందర్శించారు. కూలీలు ఎండల బారిన పడకుండా పనులు చేయాలని, వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని కోరారు. కూలీలు చేసిన పనులకు కొలతలు తీసుకోవాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. వందరోజుల పనుల్లో కూలీలందరినీ భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఉపాధి సిబ్బందితో పాటు కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న తహసీల్దార్

దండేపల్లి: మండలంలోని 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెవెన్యూ, ఐకేపీ సిబ్బంది శనివారం మూడు టీంలుగా ఏర్పడి సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించడంతో పాటు, తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించే వాటిపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగవంతం చేయడంతో పాటు, తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. డీపీఎం రమేశ్, తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ విజయ, ఆర్ఐ భూమన్న, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి



ఓటరు స్లిప్పుల పంపిణీలో తహసీల్దార్ బికర్ణదాస్

భీమిని/లక్సెట్టిపేట: అర్హులైన వారందరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శనివారం భీమిని తహసీల్దార్ బికర్ణదాస్, లక్సెట్టిపేట తహసీల్దార్ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల సమయంలో ఎండ వేడి ఎక్కువగా ఉంటుందని తాగునీరు, టెంటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎన్నికలపై, పోలింగ్ కేంద్రాల నిర్వాహణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశారు.

దండేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటికి తిరుగుతూ, ఓటరు జాబితాలో పేర్లు ఉన్న ప్రతీ ఒక్కరికీ స్లిప్పులు అందించారు.

'యూటర్న్ రద్దు చేయాలనడం సరికాదు'



మాట్లాడుతున్న తిరుమల హిల్స్ కాలనీవాసులు

బెల్లంపల్లి: నేషనల్ హైవే రోడ్డు బెల్లంపల్లి కన్నాల శివారు తిరుమల హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ రోడ్డును ఎత్తివేయాలని కొందరు డిమాండ్ చేయడం సరికాదని తిరుమల హిల్స్ కాలనీవాసులు తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. యూటర్న్ వద్ద తప్పిదాలతో ఇటీవల కొన్ని ప్రమాదాలు జరిగాయని తెలిపారు. అదే సాకుగా తీసుకుని ఏకంగా కాలనీవాసులకు ఉపయోగపడే యూటర్న్‌ను పూర్తిగా తొలగించాలని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రతి రెండు కిలో మీటర్ల దూరానికొక యూటర్న్ ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయని, యూటర్న్ వల్ల తిరుమల హిల్స్ కాలనీవాసులతో పాటు కన్నాల గ్రామస్తులకు, కంటి ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. యూటర్న్ వద్ద హైమాస్ట్ లైట్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తిరుమల హిల్స్ కాలనీవాసులు బుక్య సీతారాం, ఆకుల శశికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దు'



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పలువురు వ్యాపారులు వారి షాపులను పెద్దగా చేసుకోవడానికి అదనంగా నిర్మాణాలు చేపట్టడానికి సిద్ధపడుతున్నారని, అలాంటి వ్యాపారులకు అవకాశం ఇవ్వొద్దని మార్కెట్ ఏరియాలోని పలువురు చిన్న షాపుల నిర్వాహకులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికే పలువురు వ్యాపారులు మున్సిపల్ అధికారులు నిర్మించిన కాలువ దాటి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై నిర్మాణాలను తొలగించాలని, కొత్త నిర్మాణాలకు అవకాశం ఇవ్వరాదని హెచ్చరించారు. లేకుంటే అధికారులపై, అక్రమ నిర్మాణదారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చిన్న వ్యాపారులు శ్రీనివాస్, అమీన్, యూసఫ్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

30న సేంద్రియ మేళా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల వైశ్య భవన్‌లో ఈ నెల 30న ఉదయం 10గంటలకు నిర్వహించే సేంద్రియ మేళాను జయప్రదం చేయాలని హాజీపూర్ రైతు ఉత్పత్తి సంస్థ డైరెక్టర్ పూస్కూరి శ్రీనివాస్‌రావు కోరారు. హాజీపూర్ ఎఫ్‌పీఎస్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. సేంద్రియ మేళాలో రైతులు సమష్టిగా పాల్గొని, సేంద్రియ ఉత్పత్తులను వాడటంలో చైతన్యం కావాలని తెలిపారు. తమ ఇంటి అవసరాల కోసం ప్రతీ రైతు కనీసం ఎకరంలో సేంద్రియ సాగు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్ సభ్యులు గోనె శ్యాంసుందర్‌రావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, ధర్మయ్య, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పరీక్షకు నోటిఫికేషన్

లక్సెట్టిపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ, బీఎడ్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25వ సంవత్సరానికి గాను నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఏ, బీఎడ్ కోర్సులో చేరడానికి ఎన్‌సీఈటీ నోటిఫికేషన్ విడుదల చేసిందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఇంటర్నెట్‌లో లేదా ఆన్‌లైన్ కేంద్రాలలో పరిశీలించుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



చెన్నూర్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మంచిర్యాలటౌన్/దండేపల్లి: జిల్లా కేంద్రంలోని 35వ వార్డుకు చెందిన 170మంది మైనార్టీ నాయకులు, యువకులు, దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

నస్పూర్: పట్టణ పరిధిలో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కార్మిక గర్జన సభ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తాళ్లపల్లి మాజీ సర్పంచ్ గొట్టం తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు వేల్పుల రవీందర్, గట్టు శ్రీనివాస్, మాజీ వార్డుమెంబర్లు బండి తిరుపతి, నాయకులు పత్తి వెంకటేష్, అంబాల రాజేశ్, తోట కిష్టయ్య, తోకల సురేష్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

చెన్నూర్: చెన్నూర్ పట్టణ, మండలంలోని బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు 100మందికి పైగా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ఆదర్శనగర్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్నర్ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు ముత్యాల బాపుగౌడ్, చీర్ల సుధాకర్‌రెడ్డి, గొడిసెల బాపురెడ్డి, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకే మాలల మద్దతు'

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు మాలల జేఏసీ చైర్మన్ గడమండ్ల చెన్నయ్య తెలిపారు. బెల్లంపల్లి అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన మాల మహానాడు సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరపున పెద్దపల్లి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వంశీకృష్ణ గెలుపునకు మాలలు కృషి చేస్తారని ప్రకటించారు. ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు. కలిసికట్టుగా మాలలు వంశీ విజయానికి దోహదపడాలని కోరారు. సమావేశంలో మాలల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, గోపాజి రమేష్, జాతీయ కార్యదర్శి దమ్మ నారాయణ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, నాయకులు మల్లయ్య, మాలెం చిన్నయ్య, చంద్రశేఖర్, గోపి, రవికుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ ప్రచారం

పాతమంచిర్యాల: గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, శ్రీరాంపూర్‌లలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ఇన్‌చార్జి హఫీజ్, పెద్దపల్లి పార్లమెంట్ మహిళా ఇన్‌చార్జి దుర్గ, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి'

పాతమంచిర్యాల: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే సింగరేణి సంస్థను అంబానీ, అదానీ సంస్థగా మారుతుందని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి రాజేశ్వరీ, గుమాస ప్రకాష్, ఎర్మపున్నం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలపై ఇంటింటికీ ప్రచారం చేయాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యంగా ఎన్నికలు అయ్యే వరకు కష్టపడాలన్నారు. ప్రతీ కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, పీఏసీఎస్ చైర్మన్ రవి, సీనియర్ నాయకులు రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, దుర్గం లక్ష్మీనారాయణ, సుధాకర్‌నాయక్, పంకజ, శాకీర్ అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికల కలహాలు

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమన్వయం కొరవడి ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్య కార్యకర్తలు తోచిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఇతర పక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను కాంగ్రెస్ పార్టీలో ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకోవద్దని తెగేసి చెబుతున్నారు. ఓ అడుగు ముందేసి అధి నాయకత్వంతో రాద్ధాంతానికి దిగుతున్న తీరు బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌లో తాజాగా నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోంది. తాండూర్ మండలంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఆ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇతర పక్షాల నుంచి చేరికలకు రంగం సిద్ధం చేసుకోగా కాంగ్రెస్ శ్రేణుల అభ్యంతరాల నడుమ ఆ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయి బాహాటంగానే కయ్యానికి కాలు దువ్వి, సవాళ్లు విసురుకోవడం, పరస్పరం దూషించుకోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. బీఆర్ఎస్ నాయకుల చేరికలు వద్దే వద్దని కాంగ్రెస్ నాయకులు కొందరు ఆందోళనలు చేసి అడ్డుకోవడం కాంగ్రెస్ మార్కుకు గుర్తు చేయగా శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీలోనూ దాదాపు అదే సీన్ రిపీట్ అయింది. అయితే వీధిలో కాకుండా నాలుగు గోడల మధ్య ఆ తంతు సాగింది.

ఆ కౌన్సిలర్లను చేర్చుకోవద్దు...

బెల్లంపల్లి మున్సిపాలిటీ నుంచి చేరికల కోసం కాంగ్రెస్ పార్టీ సమాలోచనలు చేస్తోంది. పక్షం రోజుల నుంచి ముఖ్యనాయకులు మంతనాలు చేస్తున్నారు. చేరికలకు ఆసక్తి చూపుతున్న మున్సిపల్ కౌన్సిలర్లతో ఈ పాటికే రెండు దఫాలు చర్చించినట్లు తెలుస్తోంది. ఎంపీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పది మందికిపైగా కౌన్సెలర్లకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకోవాలని ఓ వర్గం తాపత్రాయపడుతుండగా, మరో వర్గం నాయకులు కొందరి పట్ల అభ్యంతరాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నలుగురు కౌన్సెలర్లతో పాటు మరి కొందరిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని మోకాలొడ్డుతుండటం చర్చనీయాంశమైంది. ఓ మాజీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా మెలిగిన సీనియర్ నాయకులైన ఇద్దరు కౌన్సెలర్లతో పాటు మరో ఇద్దరు కౌన్సెలర్ల తీరు సరిగ్గా లేదని చెబుతూనే ఆయా వార్డులకు చెందిన కాంగ్రెస్ శ్రేణుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ఆ నలుగురిని పార్టీలో చేర్చుకోవద్దనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లుగా చెబుతున్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రేణులను ఏ తీరుగా చేర్చుకున్నామో, ఇప్పుడు కూడా అదే తీరుగా చేరికలకు సిద్ధపడాలని, అప్పుడు వారి పట్ల లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకని కాంగ్రెస్‌లోని మరోవర్గం ప్రశ్నిస్తుండటంతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

సంక్షిప్త వార్తలు

పాఠశాలల్లో పనుల పరిశీలన

మందమర్రిరూరల్: మండంలోని పలు గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. వచ్చే నెల 31వరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు.

'దుష్ప్రచారం చేయడం తగదు'

బెల్లంపల్లి: తమ అమ్మానాన్నలను తాము సంరక్షించడం లేదని, కొందరు తామంటే గిట్టని వాళ్ల ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం తగదని బెల్లంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఏజాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. షాదీఖానా భూమిని కబ్జా చేసిన తాజ్, మహబూబ్ అనే వ్యక్తులు తమ అమ్మానాన్నలను మభ్యపెట్టి ఆర్డీవో కార్యాలయానికి తీసుకెళ్లి, లేనిపోని అభాండాలతో వాయిస్ రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఆరోపించారు.

ఆర్థిక సాయం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో నివసిస్తున్న పిట్టల సతీష్ మూడు నెలలుగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆత్మీయ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సతీష్‌కు వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు అందజేశారు.

చలివేంద్రాలు ప్రారంభం

మంచిర్యాలటౌన్/నస్పూర్: రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో, నస్పూర్ సీసీసీ కార్నర్ వద్ద చలివేంద్రాలను ట్రస్టు సెక్రటరీ కొక్కిరాల సత్యపాల్‌రావు, రుక్మిణిలు ప్రారంభించారు. మంచిర్యాల బస్టాండ్, మార్కెట్ ఏరియా, ఐబీ చౌరస్తా, హమాలివాడ, ఓవర్‌బ్రిడ్జి, బెల్లంపల్లి చౌరస్తాలలో వీటిని ఏర్పాటు చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

రక్తకణాలు దానం

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవి సోదరుడు శ్రీకాంత్ అత్యవసరంగా రక్తకణాలు అవసరం ఉన్న స్వామికి శనివారం అందించారు. గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో రక్తకణాలు తగ్గి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుసుకుని, రక్తకణాలు అందించేందుకు ముందుకొచ్చిన శ్రీకాంత్‌ను రక్తనిధి ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక అభినందించారు.